# చెర

కురిసిందీ కాదు వెలిసిందీ కాదు అన్నట్టుంది వాన. రెండు రోజుల నించీ అలాగే ఉంది. ఈ మధ్యాహ్నం నించి మరింత ఉధృతమైంది.

అందమైన దంతపు భరిణిలాంటి ఆ చిన్న గదిలో ఓ మూల ముడుచుకుని కూర్చుంది కాసులమ్మ. అర్ధరాత్రి దాటిందేమో, కంటి మీదికి కునుకు రావటం లేదు. మనసులో ఏదో వెలితి, గుండెల్లో బెంగ, భయం.

ఒకప్పుడు వర్షపు చినుకుల కోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఎంతలా ఎదురు చూసేదో! కమ్మలింటి కప్పు మీద చినుకులు చేసే నాట్యం, మువ్వల కదలిక లాంటి ఆ ధ్వని ఎంత బాగుండేదో! చూరు నుండి ధారలు ధారలుగా వెండి తీగల్లా జారే వర్షపు నీటిని చూస్తూ ఎంత సేపైనా అలా ఉండిపోయేది. అటువంటిదీ రోజు....

పరిసరాలూ, పరిస్థితులూ కూడా అనుభూతుల విలువల్ని మార్చేస్తాయన్న

విషయం పన్నెండేళ్ల ఆ చిన్ని వయసుకు అవగతం కాలేదు.

ఇంట్లో అందరూ ఎవరి గదుల్లో వారు, ఎవరి నిద్రలో వారున్నారు. వర్షపు అలజడి తప్ప అంతా స్తబ్దుగా ఉంది.

నెమ్మదిగా లేచి, కిటికీ రెక్క తెరిచింది కాసులమ్మ. చల్లగాలి రివ్వున గదిలోకి ప్రవేశించి ఆత్మీయంగా ఒంటిని తాకింది. కాస్త చలి అనిపించినా, ప్రాణం లేచొచ్చినట్లని పించింది.

బయటంతా నిర్మానుష్యంగా ఉంది. ఆ చీకటి రాత్రికి పహరా కాస్తూ వీధి దీపాలు!

దూరంగా రైలు కూత వినిపించింది.

కాసులమ్మ గుండెలు ఒక్కమారు దడదడలాడేయి.

ఆర్నెల్ల క్రితం... ఆ రోజూ ఇలాగే ఒంటరిగానే భయపడింది. ఒంటరిగానే దుఃఖించింది.

చివరికి ఒంటరికాక తప్పలేదు.

గతం తాలూకు జ్ఞాపకాల నీడలు కాసులమ్మ కళ్ళ ముందు తెరలు తెరలుగా కదలాడసాగేయి.

నాలుగు రోజులుగా ఇంట్లో అయ్యకీ అమ్మకీ మధ్య జరుగుతున్న గొడవేమిటో అర్థం చేసుకోలేని తెలివి తక్కువదేం కాదు. అయ్య నచ్చజెపుతున్నాడు ఓపిగ్గా. అమ్మకి మాత్రం ఇష్టం లేదని తెలిసిపోతూనేఉంది. కనీసం ఒక్క బిడ్డ జీవితమైనా బాగుపడ్డానికి అది తప్పదంటాడు అయ్య.

చివరికి అయ్యే గెలిచాడు. అమ్మ ఒప్పుకోక తప్పలేదు.

ఆ మర్నాడు తనను దగ్గరకు పిలిచి గోముగా చెప్పేడు, పట్నం ఎంతో బాగుంటుందనీ, అక్కడి మేడలూ, మిద్దెలూ, కార్లూ, వాటి గురించీ చెప్పి చివరికి అసలు సంగతి చెప్పేడు.

తన నోటంట ఆ మాట రాకుండా ఏ రాక్షసి అడ్డుపడిందో! అయ్య ముఖంలో ఆశ ఉంది. అతని మాటలో అభ్యర్థన ఉంది.

చివరికి తన మౌనమే అంగీకారమైంది.

ఆ రోజు.... తను జీవితంలో మరిచిపోలేని రోజు. పొద్దున్నే లేపి తలంటు పోసింది అమ్మ. ముందు రోజు సాయంత్రం అయ్య తెచ్చిన కొత్త లంగా, జాకెట్టు ఇచ్చి వేసుకోమంది. తల ఆరేక చిక్కు తీసి, దువ్వి గట్టిగా జడ వేసింది. వేడన్నం పెట్టింది.

ఏ పండుగనాడూ తమ ఇంట జరగనివన్నీ జరుగుతున్నా సంతోషమనిపించలేదు. తమ్ముడూ చెల్లెలూ కూడా ఇంట్లో జరుగుతున్న రాజభోగాలకి ఒకపక్క ఆశ్చర్యపోతున్నా రెండో పక్క దిగులుగానే ఉన్నారు.

తన పరిస్థితీ అలాగే ఉంది.

దుఃఖాన్నీ కన్నీళ్ళనూ ఉగ్గబట్టుకుంది.

అన్నాలు తిన్నాక వేపచెట్టు నీడలో కూర్చున్నారు ముగ్గురూ.

"మళ్ళెప్పుడొస్తావక్కా" అని తమ్ముడు అడిగితే -

'నువ్వు లేందే మాకెలా" అని అమాయకంగా చెల్లెలు - ఏం చెబుతుంది?

చెప్పడానికి తనకి మాత్రం ఏం తెలుసు గనక?

ఎర్రగా ఎండెక్కే వేళకి ఎక్కడికో వెళ్ళిన అయ్య తిరిగొచ్చి బయల్దేరదీశాడు. ముందు రోజు ఉతికిన తన బట్టల్ని గుడ్డ సంచిలో వేసి చేతికందించింది అమ్మ. గుడిసె తలుపు దగ్గరకు జారేసి తన వెంటే బయల్దేరి, పడవెక్కే వరకూ జాగ్రత్తలు చెబుతూనే ఉంది.

పడవ ముందుకెళ్తూ ఉంటే, ఒడ్డున నిలబడిపోయిన అమ్మ, తమ్ముడు, చెల్లెలు - వాళ్ళ మీదే మనసంతా ఉండిపోయింది. "ఎక్కడికో ప్రయాణం?" - పడవ నడిపే పైడి తల్లి ప్రశ్నకు అయ్య ఏదో సమాధానం చెప్పేడు. పాయలు పాయలుగా చీలుతున్న నదిలోని కెరటాల్ని చూస్తూ లోలోపల్నించి పొంగి వస్తున్న బాధను దిగమింగుకుంది.

పడవ దిగేక జటకా, ఆ తర్వాత రైలు -

తొలిసారి రైలెక్కడం అయినా, సంతోషమనిపించలేదు. రైలు కూత విషాదంగా వినిపించి మనసులో లేనిపోని భయాల్ని రేపింది.

మేడ మీద మేడ! నాలుగంతస్తుల భవనం. తండ్రి వెనుక ఆ భవంతి మేడ మెట్లెక్కుతూంటే ఆశ్చర్యం. ఈ రాజభవనల్లో ఉండేది ఎంత గొప్పవాళ్ళో కదా!

నిజంగా గొప్పే అనిపించింది వాళ్ళని చూస్తే. దేవతలకుండే రంగూ, అందమూను. మాట్లాడే తీరులో కూడా గొప్పదనమే!

"ఏం పేరూ?" అనడిగింది అమ్మగారు. తను చెబితే నవ్వి, "మంచిపేరే! లక్ష్మీదేవన్నమాట" అంది.

నిజమా? తన పేరు అంత మంచిదా, అనుకుంది మొదటిసారి. బాబుగారితో కాసేపు ఏదో మాట్లాడేడు అయ్య.

ఆ సాయంకాలమే ఇంటికి తిరుగు ముఖం పట్టేడు.

తూరుపు దిక్కున జిగేల్మనే ఓ పెద్ద మెరుపు! కాసేపట్లోనే గుండెలదిరే ఓ ఉరుము. క్రమంగా వర్షం పెద్దదైంది.

కిటికీ రెక్క మూసి వచ్చి పక్క మీద పడుకుని కళ్ళు మూసుకుంది కాసులమ్మ. నిద్ర లేదు. ఆలోచనల తెరలు!

ఇంట్లో కాలు పెట్టిన క్షణం నించీ ఆశ్చర్యమే! నునుపుదేలిన పాలరాతి గచ్చు! ఆవుపేడతో అలికిన నేల మీద, కంకర రోడ్డు మీదా, పచ్చిక బయళ్ళలోనూ నడిచిన తన పాదాలకో వింత అనుభూతి. అడుగు పెడితేనే మాసిపోతుందేమోననిపించే అందమైన గచ్చు.- రంగు రంగుల గోడలు! వింత వింత కాంతులతో విద్యుత్ దీపాలు. పాటలు వినిపించే రేడియో. బొమ్మలు కనిపించే రంగుల టెలివిజను. ఇంకా పేర్లు తెలియనివీ... తనెప్పుడూ చూసి కూడా ఎరుగనివీ ఎన్నో వింత వింత వస్తువులు ఆ ఇంట.

తనకంటూ ఓ చిన్న గది. ఆ గదిలోనూ మీట నొక్కితే వెలిగే దీపం తలుపు తెరిస్తే ఊరంతా కనిపించే ఓ కిటికీ - ఆ కిటికీలోంచే గాలి వెల్తురూ. ఆ కిటికీలోంచే జ్ఞాపకాలునూ.

తెల్లారి ఐదింటికి నిద్ర లేచి తన పనులు తను చేసుకుని అమ్మగారికి ఇంటి పనుల్లో సాయపడ్డం. వాళ్లతోపాటే కాఫీ, టిఫినూ, భోజనం.

అంట్లూ గిన్నెలూ తోమడం, వంటలో సాయం చేయడం. అన్ని గదులూ తడిగుడ్డతో తుడవడం, చాకలి ఉతికి ఆరేసిన బట్టల్ని ఆరేక మడతలు పెట్టడం, అవసరమైన బట్టలు ఇస్త్రీ చేయించి తీసుకురావడం. చిన్న చిన్న బజారు పనులు చేయడం, కుండీల్లోని పూల మొక్కలకు రెండు పూట్లా నీళ్ళు పోయడం - ఇలా అదీ ఇదీ అని లేదు. ఇంట్లో ఉండి వాళ్ళే పని చెబితే అది నమ్మకంగా చేయడమే.

ఇంతకీ ఆ ఇంట్లో ఉండేది నలుగురే నలుగురు అయ్యగారూ, అమ్మగారూ, అరుణమ్మా, అరవిందుబాబూ.

అరవిందు బాబును చూస్తుంటే తమ్ముడే గుర్తొస్తాడు. పోలికలు కుదిరి కాదు. తన తమ్ముడికి కూడా ఇంత రాజా లాంటి బతుకెందుకు లేదూ అనిపించి. పాలు, పళ్ళు, బిస్కెట్లూ వంటి ఆహారమూ, మడత నలగని మెరిసే బట్టలూ, కాలికి రకరకాల జోళ్ళూ, బోలెడన్ని పుస్తకాలూ - ఇవేవీ లేకపోవడానికి తన తమ్ముడు చేసిన తప్పేమిటీ? అనిపించి.

అరవిందుబాబు కంటే ఆరేళ్ళు పెద్దది అరుణ. పద్నాలుగేళ్ళుంటాయి. కానీ, పోషణ వల్ల కాబోలు ఏపుగా పదహారేళ్ళ పిల్లలా ఉంటుంది.

నిజానికి తను అరుణ కంటే రెండేళ్ళు చిన్నది. కానీ, అర్భకంగా ఉంటుందేమో నాలుగేళ్ళు చిన్నదానిలా కనిపిస్తుంది.

అరుణ ఆడపిల్లల కాన్వెంట్‌లో చదువుతోంది. కాన్వెంట్ డ్రస్‌లో చూస్తే పదమూడేళ్ళ పిల్లలా కనిపిస్తుంది. కాన్వెంట్ డ్రస్ మార్చుకుని సాయంకాలం లంగా ఓణీగాని, పంజాబీ డ్రస్‌గాని వేసుకుంటే అరుణ అందమే మారిపోతుంది. అరుణ, ఆమె స్నేహితురాళ్ళు రకరకాలైన బట్టలేసుకుని రెండు మూడు భాషల్లో మాట్లాడుకుంటూ, నవ్వుతూ కేరింతలాడుతుంటే చూడముచ్చటగా ఉంటుంది. అటువంటి జీవితమే జీవితం అనిపిస్తుంది. వాళ్ళతో కలిసి సరదాగా తనూ కబుర్లు చెప్పాలనీ, కలిసి ఆటలాడాలనీ, చదువుకోవాలనీ అనిపిస్తూంటుంది. కానీ ఆ కోరిక తీరేదేనా?

"కాసులమ్మా కాఫీ" అని కేకేస్తుంది అరుణ వాళ్ళెవరైనా వచ్చినప్పుడు. ఆ మాటలు అదోలా ముద్దు ముద్దుగా ఉంటాయి. ఎంతమంది వచ్చారో చూసి వాళ్ళకి కాఫీలు అందిస్తుంది తను.

'థాంక్స్' అంటారు వాళ్ళు కాఫీ అందుకుంటూ. ఆ పదానికి అర్థమేమిటో కొన్నాళ్ళవరకు తెలిసిందే కాదు.

ఆ ఇంట్లో మనుషులంతా ఎంత తీరిక లేకుండా ఉంటారో, వాళ్ళ ఫోను కూడా

అంతే విశ్రాంతి లేకుండా ఉంటుంది. ఎప్పుడూ ఎవరో ఒకరు మాట్లాడుతూనే ఉంటారు. ఊళ్ళో వారితోనే కాక, పై ఊళ్ళో ఉన్న వాళ్ళతో కూడా అందులో మాట్లాడవచ్చునని తెలిశాక మనసు పరి పరి విధాల పోయింది. ఒక్కసారి అమ్మతోనో, తమ్ముడితోనో, చెల్లాయితోనో మాట్లాడితేనో... అనిపించేది. కానీ, ఎలా?

ఆశ్చర్యంగా రోజులు గడిచిపోతూనే ఉన్నాయి. అన్ని సౌకర్యాలూ ఉన్నా మనసు ఎల్లవేళలా ఇంటి వైపే. బంగారు పంజరం లాంటి ఈ ఇంటి నించి బయటపడి, తమ ఊరు వెళ్ళిపోయి తమ్ముడు, చెల్లాయిలతో ఆడుకోవాలనీ, మొక్కల్నీ కోళ్ళనీ పెంచుతూ వాటి ఆలనా పాలనా చూడాలనీ, తల్లికి పనిలో సాయపడాలనీ; ఆకాశం, వెన్నెల, ఎండ, పచ్చిక బయళ్ళు – వీటిని చూస్తూ అనుభవించాలనీ ఇలా ఎంతగానో ఉండేది. కానీ, అయ్య తనను దిగవిడిచి వెళ్తూ చెప్పిన ఆ రెండు మాటలూ తన ఆలోచనల్ని అదుపులో పెట్టి కట్టిపడేసేవి.

మునసబు దగ్గర అయ్య తీసుకొన్న అప్పు తీరేదాకా తనకీ చెర తప్పదు. వచ్చే నూట పాతికలోనూ వంద మునసబుగారికీ, పాతిక అయ్యకీ, అదే ఒప్పందం. రెండేళ్ళు, ఎంతలో గడిచిపోవాలి! ఆ తర్వాత తనూ హాయిగా.... స్వేచ్ఛగా.... భవిష్యత్తును అందంగా ఊహించుకుంటూ గడుపుకొస్తోంది.

◆ ❖ ◆

చినుకులు మళ్ళీ పెద్దవయ్యాయి. గాలి జోరు కాస్త తగ్గింది. కిటికీ రెక్కల్ని మూసి వచ్చి గుండెల వరకూ దుప్పటి కప్పుకుంది కాసులమ్మ.

రోజు మొత్తం మీద ఎప్పుడో ఒకప్పుడు ఒంటరితనం బాధిస్తూనే ఉంటుంది. ఆ ఒంటరితనం, అప్పుడొచ్చే ఆలోచనలూ అంతకుముందెన్నడూ తనకు లేవు. కళ్ళు మూసుకుంటే మళ్ళీ జ్ఞాపకాలు! ఆ రోజు అయ్యగారూ, అమ్మగారూ, అరవిందుబాబూ సినిమాకి వెళ్ళేరు కార్లో. అరుణకి పరీక్షలట. ఆమె ఉండిపోయింది, ఆమెకు తోడుగా తను.

బాల్కనీలో నిలబడి రోడ్డు మీద వచ్చిపోయే వాహనాల వంకా, రంగు రంగుల దీపాల వంకా చూస్తోంది. అలా మూడో అంతస్తులో నిలబడి చూస్తున్నప్పుడల్లా విచిత్రంగా అనిపిస్తూ ఉంటుంది. అంతకన్నా విచిత్రం – ఈ మేడంతా ఒకరిది కాదట. ఒక్కో అంతస్తుకి ఒక్కో యజమానట. జనాభా పెరిగి, భూమి పరిమితమై పోతున్న రోజుల్లో సొంత ఇళ్ళంటే సొంత అంతస్తులేనట! ఒక్కసారిగా ఏడుపూ పెడబొబ్బలూ వినిపించాయి కింది అంతస్తు నించి. ఆ గొంతు ఎనిమిదేళ్ల పని కుర్రాడిదని బోధపడింది. బాల్కనీ వంపు తిరిగి, కాస్త వంగి కిందికి చూసింది. ఊహించిందే జరుగుతోందక్కడ.

ఏం చేశాడో ఏమో! పని కుర్రాడిని బెత్తంతో కొడుకుతున్నాడా ఇంటి యజమాని. ఆ కుర్రాడు అడ్డుకోడానికి ప్రయత్నిస్తున్న కొద్దీ మరిన్ని దెబ్బలు. తగలకూడదని చోట్లలో. హృదయ విదారకంగా ఉందా దృశ్యం.

ఇరవై రోజులవుతుందేమో ఆ కుర్రాడా ఇంటికొచ్చి. బొద్దుగా పొట్టిగా ఉంటాడు.

ఒకట్రెండు మార్లు ఆ కుర్రాడిని పలకరించాలనుకున్నా కుదరలేదు. నాలుగు రోజుల క్రితం చూసింది – ఆ కుర్రాడు ఓ మూల కూర్చుని ఏడుస్తూ ఉండడం. ఇంట్లో ఎవరూ లేనట్లుంది. వెళ్ళి పలకరిస్తే కళ్ళు తుడుచుకుని నవ్వడానికి ప్రయత్నించేడు. ఆ నవ్వులో ఒక వంతు సంతోషం, మూడొంతుల బాధ.

అడగ్గా అడగ్గా కాసిన్ని వివరాలు చెప్పేడు. తండ్రి లేడట. తల్లి కుండలు అమ్మి సంపాదిస్తుందిట. ఇద్దరు చెల్లెళ్ళున్నారట. బడి మానిపించేసి మేనమామ తెచ్చి ఇక్కడ పన్లో పెట్టాడట. తిండి, బట్ట పెట్టి, ఎనభై రూపాయలు తల్లికి పంపుతారట.

అతడిదీ తన పరిస్థితే!

ఏడుపుకు మాత్రం ఎంత అడిగినా కారణం చెప్పలేదు. పని భారమయ్యా? తిండి చాలకా? తన వారు గుర్తొచ్చా?

వాడి బాధ తన బాధగా తలచి ఆ రోజంతా ఆలోచించి ఆ తర్వాత మరిచి పోయింది. మళ్ళీ ఈ రోజిలా....

కింద నుంచి వాడి ఏడుపు మనసును కలచివేసేలా వినిపిస్తోంది. చుట్టుపక్కల వాళ్లు ఓ మారు తొంగి చూసి, మనకెందుకులే అన్నట్టు ఎవరి ఇళ్లలోకి వాళ్ళు వెళ్ళి పోయారు.

అదే తమ ఊళ్ళో అయితే ఇలా పట్టించుకోకుండా ఉండేవారా? నలుగురూ కల్పించుకుని సమస్యను బయట కీడ్చి పరిష్కరించే వారు కాదూ?

కాసేపటికి ఆ కుర్రాడిని లోపలికి లాగి తలుపేశాడా యజమాని. అంతటితో సద్దుమణిగింది.

ఆ రాత్రి చాలాసేపటివరకూ నిద్ర లేదు. కళ్ళ ముందు తమ్ముడే కదలాడసాగేడు. తనలాగా, ఆ కింది వాటా పనికుర్రాడిలాగా తమ్ముడు కూడా అవుతాడా?

ఆ మూడోనాడు కింది వాటా అమ్మగారు ఎవరితోనో చెబుతోంది.

“మా ఊరు నుంచి తెచ్చాం పనికి సాయంగా ఉంటాడని. దేనికీ లోటు చెయ్య లేదు. ఇంటి మీద బెంగెట్టుకున్నాడేమో! ఒక రోజంతా తిండి తిన్లేదు. వెళ్ళిపోతానని ఒకటే ఏడుపు. ఆయనా నేనూ ఎంత చెప్పినా విన్నాడు కాదు. పంపించేశాం” అని.

ఆశ్చర్యపోయింది తను అది విని.

నిజంగా అదే నిజమా?

◆ ◆ ◆

వారం రోజుల నాడు టీవీలో పిల్లల సినిమా వస్తుంటే అరుణ, అరవిందుబాబు చూస్తున్నారు. పని పూర్తి చేసుకొచ్చి తనూ ఓ మూల కూర్చుంది.

భాష బోధపడలేదు. కానీ, ఎంత బాగుందనీ!

అడవిలో స్వేచ్ఛగా తిరిగే గుర్రాలను వేటాడి పట్టుకునే ఓ దొంగల గుంపు ఒకరోజు ఒక తెల్ల గుర్రాన్ని పట్టుకోడానికి ప్రయత్నించి, ఉచ్చు బిగించి కూడా పట్టుకోలేక పోతారు. ఆ గుర్రం అతి చాకచక్యంగా తప్పించుకుంటుంది. ఆ ప్రాంతంలో నివసించే

ఓ పదహారేళ్ళ అబ్బాయి ఆ దృశ్యాన్ని చూస్తాడు.

ఆ అబ్బాయికి ఒక చెల్లి, ఒక తాత ఉంటారు. ఆ ముగ్గురూ ఆ అడవిలోనే ఉంటూ కొంగల్నీ, పక్షుల్నీ, తాబేళ్ళనీ, జింకల్నీ మచ్చిక చేసి పెంచుకుంటూ, వాటిని ప్రేమగా చూసుకుంటూంటారు.

మరోరోజు కూడా ఆ దొంగలు ఆ గుర్రాన్ని పట్టాలని వచ్చి పట్టుకోలేక వెళ్ళిపోవడం చూస్తాడా అబ్బాయి. అతనికో ఆలోచన కలుగుతుంది. అందమైన ఆ తెల్ల గుర్రాన్ని తనే మచ్చిక చేసి పెంచుకుంటేనో అని.

ఆ మర్నాడే ఓ పెద్ద తాడునీ, వలనీ సంచిలో వేసుకుని బయల్దేరతాడు. తన బుల్లి పడవెక్కి పారే వాగులోంచి వెళ్తూ, వలలలో పడిన చేపల్ని పోగేసుకుంటాడు. పడవ దిగేసరికి తెల్ల గుర్రం దూరంగా కనిపిస్తుంది. అంతే. దాన్ని పట్టుకోవాలనే ప్రయత్నంలో అడుగు ముందుకు వేస్తాడు. కానీ, ఆ గుర్రం అతనికి దొరక్కుండా దూరంగా పారిపోతుంది. మర్నాడు మళ్ళీ అలాగే ప్రయత్నిస్తాడు. ఈ మారు నెమ్మదిగా దాని తలకు తాడు బిగించి పట్టుకుంటాడు.

అంతలోనే ఆ గుర్రం దౌడు తీస్తుంది. తాడు విడువకుండా పరుగెత్తుతాడు. బురదలో పడి ఈడ్చివేయబడతాడు. చివరికి వాగు దాటిన గుర్రం ఆగుతుంది. తనకు తగిలిన దెబ్బలను లెక్క చేయకుండా గుర్రం దగ్గరకు వెళ్ళి దాని ఒళ్ళంతా నిమురుతాడు. అది కూడా స్నేహ పూర్వకంగా చూస్తుంది. అంతే! దాన్ని కుటీరానికి తీసుకొచ్చి అతడూ, అతని చెల్లీ దాని గాయాల్ని తుడిచి, దానికి తిండి పెడతారు. అంతే, ఆ గుర్రం వారికి మచ్చిక అయిపోతుంది.

తర్వాత కొన్నాళ్ళకు మళ్ళీ దొంగలొచ్చి ఆ గుర్రాన్ని బంధించి తీసుకువెళ్ళాలని చూస్తారు. అది గమనించి గుర్రం రెల్లు గడ్డి తుప్పల్లో దాగుంటుంది. అదే అదనుగా నాలుగు వైపులా చుట్టుముట్టి రెల్లు అంటించి మంటలు పెడతారు వాళ్ళు. బయటపడే దారి లేక గుర్రం లోపలే ఉండిపోతుంది. ఆ సమయంలో ఆ అబ్బాయి మంటల్ని ఛేదించుకుని లోపలికి వెళ్ళి దాన్ని ఎక్కి బయటకు ఉరికిస్తాడు.

దొంగలు వెంటబడతారు. తప్పించుకుంటూ గుర్రాన్ని దౌడు తీయిస్తాడా అబ్బాయి. ఆ గుర్రానికి రౌతు చూపించే మార్గం కొండలు, గుట్టలు, వాగులు అన్నీ దాటిపోతుంటారు. వెనుక గుర్రాలపై దొంగలు వెంబడిస్తూనే వుంటారు.

చివరికి సముద్రతీరంలో దొంగలు మూడు వైపులా చుట్టు ముట్టేస్తారు. మరో మార్గం లేదు. క్షణం ఆలస్యమైతే ఇక బతుకు లేదు. భయపడకుండా కళ్ళేన్ని జళిపిస్తాడా అబ్బాయి.

గుర్రం నిర్భయంగా సముద్రంలోకి దూకుతుంది. దానిపైనే ఆ అబ్బాయి! పెద్దపెద్ద కేక లేస్తూ ఒడ్డునే నిలబడి పోతారా దొంగలు. మెరుపు లాంటి వేగంతో ఆ తెల్లగుర్రం, ఆ అబ్బాయి సముద్ర గర్భంలోకి వెళ్ళిపోతారు.

అలా ముగుస్తుందా కథ.

స్వేచ్ఛ కోసం ప్రాణాల్ని సైతం లెక్కచేయని ఆ రెండు ప్రాణుల్ని తలుచుకుంటే ఒళ్ళు పులకరించింది కాసులమ్మకి.

◆ ❖ ◆

ఆలోచనలతో ఎప్పుడు నిద్రపోయిందో... తెల్లారి అమ్మగారు పిలుస్తూంటే ఉలిక్కిపడి లేచింది. గబగబా తెమిలి పనిలోకి జొరబడింది. రాత్రి కాస్త తగ్గినట్లనిపించిన వర్షం ఈ ఉదయం మరింత ఉధృతమైంది. బంగాళాఖాతంలో వాయుగుండమంట. రేడియో లోనూ, టీవీలోనూ దానికి సంబంధించిన వార్తలూ, తీసుకోవలసిన జాగ్రత్తలూ ప్రకటించారు.

నదులూ, వాగులూ పొంగి ఊళ్ళను ముంచెత్తుతున్నాయట. వంశధారా నదికి కూడా వరదలొచ్చాయని పేపర్లో చదివి చెప్పేరు బాబుగారు. అదే నిజమైతే తమ ఊరూ, తమ పాక తుడిచిపెట్టుకుపోవడం ఖాయం. ఆ విషయమే టీ కప్పు తీసుకొచ్చి బాబుగారి ఎదురుగా ఉంచుతూ అంది కాసులమ్మ.

"మరీ అంత భయపడవలసిందేం లేదు. అటువంటి ప్రాంతాల్లో, ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుంది" అన్నారాయన అతి మామూలుగా.

కానీ, కాసులమ్మలో ఆందోళన గంట గంటకీ అధికం కాజొచ్చింది, కానీ, చెప్పుకుందికి లేదు.

మధ్యాహ్నం నాలుగు మెతుకులు తిని చాప మీద మేను వాలిస్తే మగత నిద్ర... మొలలోతు నీళ్ళలో తమ్ముడూ, చెల్లీ... కూలిపోయిన ఇంటి మట్టి గోడల మధ్య దీనంగా, నిస్సహాయంగా అమ్మా, అయ్యా - దృశ్యం కళ్ళ ముందు మెదిలింది. మెలకువ వచ్చాక వాస్తవం కాదని తెలిశాక కూడా భయం.

అడిగితే? వెళ్తానంటే .... ఏమంటారో? ఇక ఉండబట్టలేక సాయంకాలం బాబు గార్ని అడిగింది.

"నాకేదో భయంగా ఉంది. మా ఊరొక్కమారు వెళ్ళొస్తాను బాబూ" అని.

తలెత్తి ఆశ్చర్యంగా ఆమె వంక చూసి, "ఇప్పుడా?" అన్నారు.

అమ్మగారు కూడా అక్కడే ఉంది.

"ఇప్పుడెలా కుదుర్తుందీ- నాకసలే ఒంట్లో బాగుండడం లేదు. ఈ సమయంలో సాయం లేకుంటే ఎలా" అందామె.

"ఈ వర్షాలు తగ్గేక వెళ్దువుగానిలే" అన్నారు బాబుగారు అనునయంగా.

"ఎందుకు? అతగాడికే ఓ కార్డు రాయండి. ఎలా ఉన్నదీ వచ్చి చెప్పమని" అంది అమ్మగారు.

బాబుగారు నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తే ఏం మాట్లాడలేకపోయింది తను. ఏం చేయడానికీ అశక్తురాలైంది.

మూడు రోజుల ముసురు నాలుగో నాడు కూడా కొనసాగింది. పగటిపూట ఎలాగో మనసు ఉగ్గబట్టుకుని పనులతో గడిపేసినా, రాత్రులు మాత్రం ఒంటరితనం,

ఆలోచనలు – గుండెల్లోంచి పొంగుకొచ్చే దుఃఖం!

ఆ రోజు... మునిమాపువేళ.... గుమ్మానికవతల తడిసిన మేకల్లా నిల్చున్నారా నలుగురూ. తలుపు తీసినదల్లా ఒక్క క్షణం వారి వంక చూసి నిశ్చేష్టురాలై దుఃఖం, ఆనందం కలగలిపి రాగా, "అమ్మా" అంటూ తల్లి దగ్గరకు చేరింది.

అక్క వంక ఆశ్చర్యంగా చూస్తూనే దగ్గరకొచ్చారు చెల్లీ, తమ్ముడూ,

"బావున్నావా అమ్మా" అన్నాడు తండ్రి.

పగటి కలలో కలచివేసిన దృశ్యం. ఇప్పుడీ పరిస్థితి. కొంచెంగా అర్థమైనా పెదవి విప్పి అడగలేకపోయింది.

ఆ తర్వాత రాత్రి అయ్య బాబుగారితో చెబుతూండగా విన్నది.

తుపానుకీ, వంశధారా నదికి వచ్చిన వరదలకీ ఊరు శ్మశానమే అయిందిట. ఇళ్ళు నేల మట్టమయ్యాయట. గొడ్డూ గోదా కొట్టుకుపోయాయట. పంట భూములన్నీ ఇసుకతోనూ, నీటితోనూ నిండిపోయాయట. ప్రాణాలు కాపాడుకోవడానికి ప్రజలు తలో దిక్కూ తరలిపోతున్నారట!

"ఇంకక్కడేటి మిగిలింది బాబూ. ఆ ఊరితో రుణం తీరిపోనాది. కడుపు చేత్తో పట్టుకుని మా అత్తారూరు పోతన్నాం. బిడ్డని జూసిపోదామని వచ్చాం'" అన్నాడు చివరికి.

తను పుట్టి పెరిగిన ఊరితో రుణం తీరిపోయిందంటే – ఆ పరిసరాలతో తమకిక సంబంధం లేదంటే నిరాశ్రయులై తమవారు మరో ఊరు పోతున్నారంటే గుండెల్లోంచి దుఃఖం పొంగుకొచ్చింది కాసులమ్మకి.

ఆ రాత్రి తల్లి పక్కనే కరుచుకుపడుకుంది. తన పక్కనే తమ్ముడు.

"ఇక్కడెంతో బాగుంది కదే" అంటున్నాడు చెల్లెలితో.

తల్లి ఎన్నో ప్రశ్నలడిగింది. పని కష్టమైంది కాదు కదా అని సందేహం వ్యక్త పరిచింది. వేళపట్టున తిండి, అవసరానికి మించిన బట్టలూ ఉన్నందుకు సంతోషించింది. ఈ కొద్ది నెలలకే కూతురి ముఖంలో వచ్చిన నిగారింపుకు అబ్బురపడింది.

"మరొక్క ఏడాదున్నావంటే చాలు. తర్వాత వచ్చేద్దూగాని" అని బుజ్జగించింది.

నోటిలోని మాట నోటిలోనే ఉండిపోయింది కాసులమ్మకు.

ఏడాదే? ఏడాదంటే ఎన్ని నెలలు? ఎన్ని రోజులు? ఎన్ని గంటలు? లెక్క పెట్టుకోసాగింది. అన్నాళ్ళు తను ఇలా బంధికానాలో గడపగలదా?

'డబ్బు ఇంత పాపిష్టిదా' అనుకుంది మొదటిసారి. మునసబు బాకీ చాలావరకూ తీరినట్టేటనట. ఇక ఏమడుగుతాడు?

"అక్కా నేనూ నీతో ఉండిపోతానే" అన్నాడు తమ్ముడు నెమ్మదిగా చెవిలో.

"అక్కా అక్కా ఓ మంచి కథ చెప్పవే" అంది చెల్లాయి.

టీవీలో చూసిన తెల్లగుర్రం కథ చెప్పాలనుకుంది. కానీ... పాత కథే టూకీగా చెప్పింది వాళ్ళ సంతృప్తి కోసం. కథ పూర్తిగా వినకుండానే నిద్రపోయారు వాళ్ళు. ఎన్నాళ్ళ తర్వాతో తనూ సంతృప్తిగా నిద్రపోయింది.

తెల్లారి తెరిపిచ్చింది వర్షం.

మబ్బు విడి, వెలుగు బాగా వచ్చింది. రోడ్ల మీద జన సంచారం మొదలైంది. తన పనిలో తనుండేమో తండ్రితో మనసులోని మాట చెప్పడానికి వీలవలేదు. అరవిందుబాబుకి బట్టలు వేసి, బూట్లు తుడిచి స్కూలుకి తయారు చేస్తుంటే తన వంక ఆశ్చర్యంగా చూశాడు తమ్ముడు.

అరుణ కొచ్చిన ఫోను అందుకుని మాట్లాడుతుంటే, అమాయకంగా తన వంక చూసింది చెల్లెలు.

బాబుగారు వెళ్తూంటే తను బ్రీఫ్‌కేస్ కారులో పెడుతూంటే, అక్కడే ఉన్న తండ్రి అచేతనంగా చూస్తూ నిలబడ్డాడు.

బాబుగారేదో తండ్రితో చెప్పడం చూసింది కాసులమ్మ. జీతం మరికాస్త పెంచుతామని కాబోలు! తలూకెట్టి దండాలు పెట్టేడు తండ్రి.

మరి కాసేపట్లోనే బయల్దేరేరు అయ్య, అమ్మ, చెల్లీ, తమ్ముడూ. అమ్మగారి కాళ్లకు దండం పెట్టింది తల్లి.

"కాసులమ్మ గురించి మీకేం దిగులక్కరలేదు. అది మా ఇంటి మనిషి" అని కొన్ని పాత చీరలూ, బట్టలూ మూటగట్టి ఇచ్చిందామె.

వాళ్ళు వెళ్తూంటే గేటు వరకూ సాగనంపి, అక్కడ నిలబడిపోయింది కాసులమ్మ. ఏవేవో జాగ్రత్తలు చెప్పింది అమ్మ. ధైర్యం చెప్పేడు అయ్య. రోడ్డు మలుపు తిరిగేవరకూ వెనక్కు వెనక్కు తిరిగి చూస్తూనే ఉన్నారు తమ్ముడూ, చెల్లెలూ.

బరువెక్కిన గుండెతో గబగబా మూడంతస్తులూ ఎక్కి తన గది కిటికీ లోంచి చూసింది.

దూరంగా... చిన్నగా... వెళ్ళిపోతూ తన వాళ్ళు.

కళ్లలో నీటిపొర జేరింది కాసులమ్మకి.

ఆకాశంలో మబ్బులు విడి, ఎండ పొడ భూమ్మీదకి పరుచుకుంటోంది. ఆ వెలుగులో పచ్చని ప్రకృతి పరవశించిపోతోంది.

గూళ్ళలో మగ్గిన పక్షులు ఆకాశవీధిలో బారులు కట్టి ఎగురుతున్నాయి.

రైలు వేగాన్ని పుంజుకుంటుంటే ప్రకృతి వంకా, వెనక్కుపోయే చెట్ల వంకా ఆశ్చర్యంగా చూస్తున్న ఆ పిల్లలిద్దరూ ఒక్కసారి వెనక్కు తిరిగి, పెట్టెలో ఆ మూల బెంచీ వైపు చూసి ఆనందాశ్చర్యాలతో నోట మాట రాక తల్లికీ తండ్రికీ చూపించారు.

అక్కడ.... ఆ మూల... బెంచీ మీద చేతిలో చిన్న మూటతో చెప్పలేని ఆనందంతో ముడుచుకు కూర్చునుంది-కాసులమ్మ!

*ఇండియా టుడే - సెప్టెంబర్ 6-20, 1993*

*కళాసాగర్ (చెన్నై) రజతోత్సవ సంచిక, 1997*